సాక్షి
జగిత్యాల
సోమవారం । 21 । ఆగస్టు । 2023



గంగమ్మకు మొక్కులు

ధర్మపురి: శ్రావణ ఆదివారం సందర్భంగా స్థానిక గోదావరి నదిలో భక్తులు పోటెత్తారు. గంగమ్మ, గౌరమ్మకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.



కొండపై పూజలు

కొండగట్టు : శ్రీఆంజనేయస్వామి ఆలయంలో నాలుగోరోజు ఆదివారం శ్రావణ సప్తహ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు వీస్తాయి. జిల్లాలోని కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

సాయుధ దళాల్లో ఉద్యోగాల సాధన



యమున



శిరీష

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలం కొల్వాయికి చెందిన ఇద్దరు యువతులు సాయుధ దళాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. కొల్వాయికి చెందిన సమ్మెట యమున భారత కేంద్ర సాయుధ దళం(సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్స్)లో ఉద్యోగం సాధించగా, అదే గ్రామానికి చెందిన దండిక శిరీష సాయుధ సరిహద్దు దళం(సర్వీస్ సెలక్షన్ బోర్డు)లో ఉద్యోగం సాధించింది. యమున తల్లి జయ, తండ్రి రాజన్న కూలీ పనులు చేస్తున్నారు. రాజన్న ఇటీవలే బతుకుదెరువు కోసం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. యమున మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్‌లో డిగ్రీ పూర్తిచేశారు. శిరీష తల్లి లక్ష్మి కూలీ పనులు చేస్తోంది. తండ్రి మల్లయ్య గొర్రెలకాపరి. శిరీష ఎంఏ పూర్తిచేశారు.

రాజీవ్ ఆశయాలు కొనసాగించాలి



సంబురాలు చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

జగిత్యాలటౌన్: సాంకేతికతకు బాటలు వేసిన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ ఆశయాలు కొనసాగించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. బట్టివాడలో ఆదివారం రాజీవ్‌గాంధీ జయంతి నిర్వహించారు. జీవన్‌రెడ్డి మాట్లాడారు. నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కొత్త మోహన్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, విజయలక్ష్మి, నక్క జీవన్, చిట్ల అంజన్న, అల్లాల సరిత, కమాల్, మొయిజొద్దీన్, మున్న, నేహాల్, గుండ మధు, నాగేంద్ర, లైశెట్టి విజయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఓడినా, గెలిచినా ప్రజల మధ్యే ఉండి సేవ చేస్తానని జీవన్‌రెడ్డి అన్నారు. బట్టివాడలో కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించాక ఆయన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ రాబోయే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాల్సిందిగా కోరారు.

పవర్ డిప్లొమా ఇంజినీర్ల కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

జగిత్యాలరూరల్/జగిత్యాలఅగ్రికల్చర్: తెలంగాణ పవర్ డిప్లొమా ఇంజినీర్ల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పి.వరుణ్‌కుమార్, కార్యదర్శిగా డి.మనోహర్, కోశాధికారిగా ఎం.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. జగిత్యాల డివిజన్ కార్యదర్శిగా వి.సుందర్, కోశాధికారిగా బి.భాస్కర్, సెంట్రల్ డివిజన్ సెక్రటరీగా ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా జి.మహేందర్, మెట్‌పల్లి డివిజన్ సెక్రటరీగా జె.అమరేందర్, కోశాధికారిగా డి.నవీన్ ఎన్నికయ్యారు. పవర్ ఇంజినీర్స్ కంపెనీ వరంగల్ ప్రాంత కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆస్ట్రేలియాలో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత సభ



మాట్లాడుతున్న అనిల్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో ఎన్‌ఆర్‌ఐ బీఆర్‌ఎస్ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం సీఎం కేసీఆర్ కృతజ్ఞత సభ ఘనంగా నిర్వహించారు. ఆస్ట్రేలియా ఇన్‌చార్జి బైరెడ్డి అనిల్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్నివర్గాల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశ పెట్టారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకే తెలంగాణ ప్రజలు కట్టం కట్టాలని కోరారు. ఐటీ రంగంలో మంత్రి కేటీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు కవిత చొరవ విదేశాల్లో తెలంగాణ పండుగలను ఘనంగా నిర్వహించేలా చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రమేశ్, ముత్యాల మధు, రవీందర్, చుక్క సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పనులకు నిధుల కొరత



లక్ష్మీపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం

- పది నెలలుగా పాలకుల నిరీక్షణ
- పంచాయతీ కార్యకలాపాలపై ప్రభావం
- పెద్దఎత్తున బిల్లుల పెండింగ్
- తలలు పట్టుకుంటున్న ప్రజాప్రతినిధులు

జగిత్యాలరూరల్: జిల్లాలో మొత్తం 380 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధుల తోపాటు ఎస్సీ, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులను ప్రతినెలా విడుదల చేయాలి. అదే ప్రకారంగా రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు కూడా జనాభా దామాషా పద్ధతిన ఇవ్వాలి. కానీ, పది నెలలుగా నిధులు విడుదల కావడంలేదు. కేంద్ర ప్రభుత్వం కూడా ఆర్థిక సంఘం నిధులను మూడు నెలలకోసారి రూ.40 కోట్ల చొప్పున విడుదల చేస్తోంది. రాష్ట్రప్రభుత్వం ప్రతినెలా రూ.7కోట్లు విడుదల చేయాల్సి ఉన్నా.. పైసా విదిల్చలేదు.

ఆర్నెల్ల క్రితం ఖాతాలు తెరిచినా..

- ఆర్నెల్ల క్రితం గ్రామ పంచాయతీల వారీగా బ్యాంకుల్లో ప్రత్యేక ఖాతాలు తెరిచారు.
- సర్పంచ్, ఉప సర్పంచ్ పేరిట ఉండే ఈ బ్యాంకు ఖాతాల్లోనే కేంద్రప్రభుత్వం నిధులు జమ చేస్తోంది.
- కొంతకాలంగా కేంద్రప్రభుత్వం మూడు నెలలకోసారి నిధులు విడుదల చేస్తోంది.
- అయినా, వాటి వినియోగంపై అనేక ఆంక్షలు విధిస్తోంది.
- మరోవైపు.. రాష్ట్ర నిధులపై ఇంకా ఫ్రీజింగ్ కొనసాగుతోంది.
- దాదాపు పది నెలలుగా రాష్ట్రం సకాలంలో నిధులు విడుదల చేయడంలేదు.

సమ్మె విరమించి విధుల్లో చేరినా..

మరోవైపు.. తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో మల్టీపర్పస్ కార్మికులు 30 రోజులకుపైగా సమ్మె చేశారు. ఇటీవల సమ్మె విరమించి విధుల్లో చేరారు. అయినా, పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు ముందుకు సాగడం లేదు. ఈక్రమంలో పలు ప్రాంతాలు చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైంది. వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. దీంతో సీజనల్ వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని పల్లె, పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- దీంతో గ్రామ పంచాయతీలు ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి.

తలలుపట్టుకుంటున్న సర్పంచులు, కార్యదర్శులు..

గ్రామాలను పట్టణాలతో సమానంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోంది. పల్లెప్రగతి, హరితహారం వంటి పనులు చేపట్టి గ్రామాల రూపురేఖల్ని మార్చేలా ప్రణాళిక అమలు చేస్తోంది. అయినా, రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధికి ప్రతిబంధకంగా మారుతోంది. మరోవైపు.. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఫలితంగా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సమస్యలు ఎదురవుతున్నాయి.

బిల్లులు రాలేదు



గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలంటే నిధుల కొరత అడ్డు వస్తోంది. ఇప్పటికే సీసీ రోడ్లు పూర్తిచేసి నెలలు గడుస్తోంది. రూ.8 లక్షల బిల్లులు రావాల్సి ఉంది. పైసలు లేక కొత్త పనులు చేపట్టలేకపోతున్నాం. చిన్నవాన వచ్చినా వీధులన్నీ చిత్తడిగా మారుతున్నాయి. ప్రతినెలా అప్పు చేసి విద్యుత్ తదితర బిల్లులు చెల్లిస్తున్నాం.

– గంగాధర్, సర్పంచ్, అంబారిపేట

రూ.17 లక్షలు రావాలి



మా గ్రామ జనాభా 2,120. పంచాయతీకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రతినెలా సుమారు రూ.3.50 లక్షలు వచ్చేవి. పది నెలలుగా రాష్ట్ర నిధులు రావడం లేదు. కనీసం పారి శుధ్య కార్మికులకు కూడా వేతనాలు చెల్లించలేని పరిస్థితి ఉంది. ఇంతకు ముందు చేసిన అభివృద్ధి పనులకు రూ.17 లక్షల బిల్లులు రావాలి. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం ఆగిపోయింది.

– పొగ్గుల సంధ్యారాణి, సర్పంచ్, పొరండ్ల

త్వరలోనే వస్తాయి



జిల్లాలోని గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. త్వరలోనే నిధులు విడుదల చేస్తుంది. కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు మూడు నెలలకోసారి సుమారు రూ.40 కోట్లు పంచాయతీల ఖాతాల్లో జమ అవుతున్నాయి.

– దేవరాజ్, జిల్లా పంచాయతీ అధికారి

గుర్తించకున్నా.. గుర్తింపు తెచ్చిన స్వప్నిక

ధర్మపురి : తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్న అంతర్జాతీయ క్రీడాకారిణి విరంచి స్వప్నికకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. ఆర్థికంగా ఆదుకోవాల్సిన సర్కారు.. చిన్నచూపే చూస్తోంది. అయినా, మొక్కవోని ధైర్యంతో అంతర్జాయ వేదికపై నాలుగు స్వర్ణ పతకాలు సాధించి ఔరా అనిపించింది. రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చింది.



పేదరికం వెంటాడుతున్నా..

- ధర్మపురి పట్టణానికి చెందిన రంగు వెంకటరమణ – శ్రీలత దంపతుల రెండో కూతురు విరంచి స్వప్నిక.
- మగ్గిడి మోడల్ స్కూల్‌లో ఇంటర్, కరీంనగర్ ఎస్సారార్‌లో డిగ్రీ పూర్తిచేసింది.
- చదువుతోపాటు పవర్ లిఫ్టింగ్‌లో మక్కువ పెంచుకుంది.
- మగ్గిడి మోడల్ స్కూల్ పీఈటీ రాజేందర్ పవర్ లిఫ్టింగ్‌లో విరంచి స్వప్నికకు మెలకువలు నేర్పిస్తున్నారు.
- తల్లిదండ్రులు, కోచ్ సహకారంతో జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది.
- ఈ ఏడాది జూన్ 6 నుంచి 11వ తేదీ వరకు జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో నిర్వహించిన జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చాంపియన్ షిప్– సిల్వర్ మెడల్ సాధించింది.
- ఏకంగా ఆసియా యూనివర్సిటీకి ఎంపికైంది.
- తెలంగాణ రాష్ట్రంలోనే విరంచి స్వప్నిక రెండో క్రీడాకారిణిగా నిలిచింది.

రూ.2లక్షల అప్పు చేసి షార్జాకు..

రాష్ట్రప్రభుత్వం విద్య, వైద్యంతోపాటు క్రీడారంగానికి పెద్దపీట వేస్తున్నామని చెబుతోంది. పల్లెల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తోంది. మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సాహం అందిస్తామని ప్రచారం చేస్తోంది. కానీ, విరంచి స్వప్నిక ప్రతిభను గుర్తించలేకపోయింది. అధికారులు కూడా చొరవ తీసుకోలేకపోయారు. అయినా, ఆమె వెనక్కి తగ్గలేదు. తల్లిదండ్రులు తమకు తెలిసిన వారివద్ద రూ.2లక్షలు అప్పుచేసి ఆమెను షార్జా పంపించారు.



షార్జాలో ఇండియన్ క్రీడాకారులతో స్వప్నిక

వివిధ విభాగాల్లో 4 స్వర్ణ పతకాలు..

- ఆసియా యూనివర్సిటీకి ఎంపికైన విరంచి స్వప్నిక షార్జాలో ఈనెల 16న ప్రారంభమైన జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు హాజరయ్యేందుకు షార్జా వెళ్లింది. ఈనెల 21వ తేదీతో పోటీలు ముగుస్తాయి. అయితే, ఆదివారం జరిగిన పోటీల్లో విరంచి స్వప్నిక నాలుగు బంగారు పతకాలు గెలుచుకుంది. తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై నిలిపింది. ఇప్పటి వరకు ఆమె మొత్తం 23 పతకాలు సాధించింది.

అమ్మానాన్న, కోచ్ ప్రోత్సాహం

'అంతర్జాతీయ వేదికపై ప్రతిభ చూపాలనేది నా కోరిక. పవర్ లిఫ్టింగ్ పోటీలకు హాజరయ్యేందుకు అయ్యే ఖర్చు అమ్మానాన్న భరించే స్థితిలో లేరు. అయినా, వారు వెనక్కి తగ్గలేదు. తెలిసిన వారి వద్ద రూ.2లక్షలు అప్పు తెచ్చి ఇచ్చారు. ఆ సొమ్ముతో షార్జా వెళ్లిన. కోచ్ ఇచ్చిన ప్రోత్సాహం, నేర్పిన మెలకువలతో వివిధ విభాగాల్లో నాలుగు గోల్డ్ మెడల్స్ సాధించిన. ఆనందంగా ఉంది' అన్నారు స్వప్నిక.

సహకార సంఘాల బలోపేతం



సహకార సంఘ భవనం పరిశీలిస్తున్న వినోద్‌కుమార్

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

పెగడపల్లి(ధర్మపురి): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాకే సహకార సంఘాలు బలోపేతమయ్యాయని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన వినోద్‌కుమార్.. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తో కలిసి పెగడపల్లి ప్రాథమిక సహకార సంఘాన్ని సందర్శించారు. సుమారు రూ.2.50 కోట్ల వ్యయంతో ఇటీవల నిర్మించిన దుకాణ సముదాయాన్ని పరిశీలించారు. సంఘం అభివృద్ధి, రైతులకు అందిస్తున్న చైర్మన్ వోరుగంటి రమణారావు, పాలకవర్గ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సహకార సంఘాలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పౌర సేవలు అందించేందుకు ప్రత్యేకంగా ప్రాథమిక సహకార సంఘాలను గుర్తించిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి వడ్లు సేకరిస్తోందని తెలిపారు. సీఎం కేసీఆర్ రైతు సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. తొలిసారి సహకార సంఘాన్ని సందర్శించిన వినోద్‌కుమార్‌ను సిబ్బంది గోపాల్‌రెడ్డి, అనిల్, అంజయ్య సన్మానించారు. నాయకులు కరుణాకర్‌రావు, ప్రవీణ్‌రావు, అంజి, స్వామి, సాగర్‌రావు ఉన్నారు.

జాతీయస్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు ఎంపిక

వెల్గటూర్(ధర్మపురి): స్థానిక జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ బూట్ల రాజమల్లయ్య ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ జాతీయస్థాయి లాన్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 18, 19వ తేదీల్లో హైదరాబాద్ లాల్ బహదూర్ ఇండోర్ స్టేడియంలో లాన్ టెన్నిస్, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వెటరన్స్ విభాగంలో జిల్లా నుంచి రాజమల్లయ్య పాల్గొని రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆయనను పలువురు అభినందించారు.



రాజమల్లయ్య

మోదీతోనే సుపరిపాలన

- యూపీ శాసనసభ్యుడు పీఎన్ పాఠక్



మాట్లాడుతున్న పాఠక్

ధర్మపురి: దేశానికి సుపరిపాలన అందించే సత్తా ప్రధానమంత్రి నరేంద్రమోదీకే ఉందని ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడు పీఎన్ పాఠక్ అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎస్‌ఆర్‌ఆర్ గార్డెన్‌లో ఆదివారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. పాఠక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయవాద సిద్ధాంతంతో దేశాభివృద్ధి, బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా బీజేపీ పాలిస్తోందన్నారు. అవినీతి, కుటుంబ పాలనకు వ్యతిరేకమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అధికారమే లక్ష్యంగా ఆచరణకు సాధ్యం హామీలు ఇస్తున్నారని, ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దళిత సీఎం, దళితులకు మూడెకరాల పంపిణీ, డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, ఉచితంగా ఎరువుల పంపిణీ, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని చెప్పి ఇప్పటికీ అమలు చేయడం లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండగా ప్రభుత్వం కొత్త నాటకాలకు తెరలేపిందని ధ్వజమెత్తారు. బీసీబంధు, మైనార్టీ బంధు, దళితబంధు పేరిట ప్రజలను మళ్లీ మోసం చేయడానికి సిద్ధమైందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని కోరారు. నాయకులు కస్తూరి సత్యం, గాజుల మల్లేశం, పిల్లి శ్రీనివాస్, ఓరుగంటి చంద్రశేఖర్, మర్రిపెల్లి సత్యం, బండారు లక్ష్మణ్, గంగారాం, లవన్‌కుమార్, బుచ్చన్న, మురళి, శ్రీధర్ ఉన్నారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

జగిత్యాల: జిల్లాలోని అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలను విస్తృతంగా నిర్వహించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆదేశించారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో భారీవర్షాలు కురిశాయని, వాతావరణంలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ కారణంగా సీజనల్, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. వాటి నియంత్రణకు ముందస్తుగా గ్రామాలు, పట్టణాల్లో అవసరం మేరకు వైద్యశిబిరాలు నిర్వహించి అందరికీ పరీక్షలు చేయాలని, అవసరమైన వారికి మందులు పంపిణీ చేయాలని మంత్రి సూచించారు.

ఎమ్మెల్యే పాటిల్‌కు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న బీజేపీ శ్రేణులు

జగిత్యాలటౌన్: జగిత్యాల పర్యటనకు వచ్చిన కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బీజీ పాటిల్‌కు నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల నియోజకవర్గంలో 8రోజుల పర్యటన కోసం ఆయన ఆదివారం సాయంత్రం జగిత్యాలకు చేరుకున్నారు. ఆయనను తొలుత శాలువాలతో సత్కరించారు. పూల మొక్క అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, నాయకులు పన్నాల తిరుపతిరెడ్డి, మదన్‌మోహన్, ప్రవీణ్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు జిల్లాల్లో లక్కీ డ్రా వేదికలు ఇవే..

పెద్దపల్లి జిల్లాలో..

- పెద్దపల్లి పట్టణ శివారులోని బందంపల్లి స్వరూప గార్డెన్‌లో వైన్స్‌ల లక్కీడ్రా తీసేందుకు ఎక్సైజ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. షాపుల వారీగా వచ్చిన దరఖాస్తులను బట్టి డ్రాలో నంబర్లు వేయనున్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ డ్రా తీసిన ప్రకారం.. షాపులు కేటాయించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో 77 షాపులకు 2,022 మంది దరఖాస్తు చేయగా, వారి సమక్షంలోనే సోమవారం ఉదయం 10.30గంటల నుంచి డ్రా తీస్తారు.

కరీంనగర్ జిల్లాలో..

- కరీంగనగర్ జిల్లాలో 94 షాపులకు 4,040 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గోపి ఆధ్వర్యంలో లక్కీడీప్ ద్వారా వైన్స్ కేటాయిస్తారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జగిత్యాల జిల్లాలో..

- జగిత్యాల జిల్లాలోని విరూపాక్షి గార్డెన్‌లో మద్యం షాపుల లక్కీ డ్రా తీస్తారు. కలెక్టర్ యాస్మిన్‌బాషా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది. జిల్లాలోని మొత్తం 71 షాపులకు 2,636 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తుదారుల సమక్షంలో డ్రా తీసి మద్యం దుకాణాలు కేటాయిస్తారు.

సిరిసిల్ల జిల్లాలో..

- రాజన్న సిరిసిల్ల కలెక్టర్ ఆడిటోరియంలో సోమవారం ఉదయం లక్కీడ్రా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 48 షాపులకు 2,032 దరఖాస్తులు రాగా గెజిట్ నంబర్ల ప్రకారం కలెక్టర్ అనురాగ్ జయంతి ఆధ్వర్యంలో లక్కీడీప్ ద్వారా వైన్స్ కేటాయిస్తారు.

లక్కీడ్రాప్ ఎవరికో..!

- నేడు తేలనున్న వ్యాపారుల భవితవ్యం
- గతంకన్నా భారీగా పెరిగిన దరఖాస్తులు
- 290షాపులకు 10,730 దరఖాస్తులు
- అత్యధికంగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో..



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వైన్‌షాపుల లక్కు ఎవరిని వరిస్తుందోనని మద్యం వ్యాపారుల్లో టెన్షన్ మొదలైంది. లాటరీ ద్వారా ఎంపికకు మరికొద్ది గంటల సమయమే ఉంది. ఈక్రమంలో దీనిపై చర్చ జోరుగా సాగుతోంది. ఈసారి దరఖాస్తు ఫీజు రూ.2లక్షలుగా నిర్ణయించారు. దీంతో భారీమొత్తం చెల్లించి కొందరు ఒకటికి మించి షాపులకు దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 290వైన్స్‌లకు గతంలో 5,215 దరఖాస్తులు రాగా ఈసారి వాటి సంఖ్య 10,730కు చేరింది. శుక్రవారం రాత్రి వరకూ క్యూలైన్‌లో ఉండి.. మరీ పోటీపడి వ్యాపారులు దరఖాస్తు చేశారు. వైన్స్‌ల కోసం దరఖాస్తులు అందించిన వారి గెజిట్ నంబర్ల ప్రకారం డ్రా తీసేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా కలెక్టర్ల స్వీయ పర్యవేక్షణలో మద్యం దుకాణాల వారీగా లక్కీ డ్రా తీయనున్నారు. గతం కన్నా రెట్టింపుస్థాయిలో దరఖాస్తులు వచ్చాయని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అయితే, ధరావత్తు సొమ్ము రూ.2లక్షలు చెల్లించి దాఖలు చేసిన దరఖాస్తుదారులకు వైన్స్ దక్కకుంటే పరిస్థితి ఏమిటనే ప్రశ్న అందరిలోనూ మొదలైంది. గ్రూపుల వారీగా ఏకమై.. సిండికేట్‌గా మారి ఎవరికి వైన్స్ వచ్చినా ఉమ్మడిగా దరఖాస్తుల సొమ్ము జమచేసి షాపులు నడిపించుకుందామనే ఒప్పందానికి వచ్చారని సమాచారం.

290 మద్యం దుకాణాలు.. 10,730 దరఖాస్తులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని 290 వైన్స్‌లకు 10,730 దరఖాస్తులు వచ్చాయి. గతంలో ఇవే షాపులకు 5,215 దరఖాస్తులు మాత్రమే అందాయి. గతంలో కన్నా రెట్టింపు స్థాయిలో దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

వైన్స్‌లకు అందిన దరఖాస్తులు

జిల్లా	షాపులు	గతం	ప్రస్తుతం
పెద్దపల్లి	77	1080	2,022
కరీంనగర్	94	1720	4,040
సిరిసిల్ల	48	944	2,032
జగిత్యాల	71	1471	2,636
మొత్తం	290	5,215	10,730

సిండికేట్‌కు సిద్ధమైన వ్యాపారులు

ఈసారి దరఖాస్తులతోపాటు రూ.2లక్షల ఫీజు చెల్లించాల్సి రావడంతో ఒక్కో బృందం భారీగా దరఖాస్తులు సమర్పించాయి. దీంతో లక్కీడ్రాపై గంటగంటకూ ఉత్కంఠ పెరిగిపోతోంది. షాపుల వారీగా డ్రా వేసి దరఖాస్తుదారులను ఏకంచేసి ఎవరికి దుకాణం దక్కినా.. అందరూ కలిసి షాప్ ఏర్పాటు చేసుకునే ఒప్పందంలో అందరూ బిజీగా ఉన్నారు.

క్లుప్తంగా

ఢిల్లీకి తరలివెళ్లిన అడ్లూరి లక్ష్మణ్



ఢిల్లీలో మల్లికార్జున ఖర్గేతో అడ్లూరి, నాయకులు

ధర్మపురి : ఈనెల 26న చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై ప్రకటించడంపై ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య సమావేశానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తరలివెళ్లారు. అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి రాష్ట్రంలోని 14 మంది ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన కాంగ్రెస్ మాజీ మంత్రులు, సీఎల్పీ నేతలు, జెడ్పీ చైర్మన్లు, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి హాజరైన మాజీ జెడ్పీ చైర్మన్ డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దళిత డిక్లరేషన్‌పై తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పేద దళిత వర్గాలకు చెందాల్సిన ఇనామీ, సుంకరి భూములను భూస్వాములు, భూహక్కుదారులతో కుమ్మక్కై తక్కువ ధరలకు కొనుగోలు చేసి అన్యాయం చేస్తున్నారన్నారు.

తలనీలాల డబ్బా సీజ్



తలనీలాల డబ్బాను సీజ్ చేస్తున్న అధికారులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆలయానికి సంబంధించి తలనీలాలు పోగు చేసుకునే టెండర్ గతనెల 31న ముగిసింది. ఈనెల నుంచి భక్తులు సమర్పించిన వెంట్రుకలను దేవస్థానం ఆధ్వర్యంలో పోగుచేయగా డబ్బా నిండింది. ఆలయ అధికారుల సమక్షంలో డబ్బాను సీజ్‌చేసి భద్రపరిచారు. ఏఈవో బుద్ది శ్రీనివాస్ సూపరింటెండెంట్‌లు సునీల్, శ్రీనివాస చారి, ధర్మకర్త ప్రవీణ్ ఉన్నారు

పాత ఇల్లు కూల్చేస్తున్నారని..

- పురుగుల మందుతాగి వృద్ధ దంపతులు ఆత్మహత్య




దేవయ్య, లక్ష్మీ నర్సవ్వ మృతదేహాలు

చందుర్తి (వేములవాడ) : ఏళ్ల తరబడి ఉంటున్న ఇల్లును పెద్ద కుమారుడు, కోడలు కూలగొడుతున్నారని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి వృద్ధ దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఆశిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఆశిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కనికరపు దేవయ్య (69), లక్ష్మీ నర్సవ్వ (60) దంపతులకు ఇద్దరు కుమారులు కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు రవీందర్, కోడలు మణెమ్మ ఇల్లును కూల్చివేస్తామని, ఇంట్లోంచి వెళ్లిపోవాలని వృద్ధ దంపతులతో గొడవ పడ్డారు. కాగా తాము ఉన్నన్ని రోజులు ఇల్లును కూల్చవద్దని రవీందర్‌తో తేల్చిచెప్పారు. శనివారం ఇంటిని కూల్చివేసే క్రమంలో కుమారుడితో మరోసారి గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన దేవయ్య, లక్ష్మీ నర్సవ్వ ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రవీందర్, మణెమ్మపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): కాల్వశ్రీరాంపూర్ ఎస్బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఏటీఎం బాక్స్ తెరిచి ఉండటాన్ని ఆదివారం వేకువజామున గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

పాత కమిషనర్ సంతకంతోనే..

- 20 రోజుల క్రితం మున్సిపల్ కమిషనర్‌గా అనిల్‌బాబు బాధ్యతలు
- ఇంకా పాత కమిషనర్ డిజిటల్ సైన్‌తోనే సర్టిఫికెట్లు జారీ
- సాంకేతిక లోపమా... అధికారుల నిర్లక్ష్యమా ?
- అయోమయంలో ప్రజలు




పాత కమిషనర్ డిజిటల్ సైన్‌తో జారీ అయిన జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు

జగిత్యాల: అతను మున్సిపల్ కమిషనర్. జగిత్యాల గ్రేడ్–1 మున్సిపాలిటీకి ఇటీవలే కొత్తగా కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. కానీ అయినా డిజిటల్ సంతకంపై సర్టిఫికెట్లు జారీ కాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఇన్‌చార్జి కమిషనర్‌గా పనిచేసిన నరేశ్ పేరుతోనే ఇంకా జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అవుతున్నాయి. సాంకేతిక లోపమా.. లేక అధికారుల నిర్లక్ష్యంతోనా తెలియక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన కమిషనర్లు దీర్ఘకాలిక సెలవులపై వెళ్లడం, ఇక్కడి అధికారులు, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో ఎవరూ పనిచేయక వెళ్లిపోయారు. దీంతో ఇక్కడే వెటర్నరీ జిల్లా అధికారిగా పనిచేస్తున్న నరేశ్‌కు ఇన్‌చార్జిగా మున్సిపల్ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా వరంగల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అనిల్‌బాబు బదిలీపై వచ్చి ఈనెల 1న బాధ్యతలు స్వీకరించారు. వారం రోజులుగా జారీ అవుతున్న జనన, మరణ సర్టిఫికెట్లలో గతంలో పనిచేసిన పాత కమిషనర్‌దే డిజిటల్ సైన్‌లో వస్తుంది. నూతన కమిషనర్‌గా వచ్చి 20 రోజులు అవుతున్నా డిజిటల్ సైన్ కాకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులు బదిలీపై వచ్చినప్పుడు సంబంధిత అధికారులు డిజిటల్ కీ తయారు చేయాల్సి ఉంటుంది. డిజిటల్ కీ ఉందని అధికారులు చెబుతున్నా సర్టిఫికెట్లపై ఎందుకు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

సాంకేతికతనే కారణమా...

సీడీఎంఏలో కొన్ని సందర్భాల్లో సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతుంటాయని, దాని వల్లే సర్టిఫికెట్లపై డిజిటల్ సైన్ పాత కమిషనర్‌పై వస్తున్నాయని, ఇది సాంకేతిక లోపమేనంటూ బల్దియా అధికారులు చెబుతున్నారు. కానీ ఏదైనా సమస్య తలెత్తితే ఎవరు బాధ్యులని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అన్ని డిపార్ట్‌మెంట్లలో ఇదే పరిస్థితా..!

ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం, రెవెన్యూ విభాగం నుంచి మ్యుటేషన్లు, ఇంటి నిర్మాణ అనుమతి పత్రాలు జారీ అవుతుంటాయి. ఇందులో సైతం పాత కమిషనర్ డిజిటల్ సైన్ వస్తుందా ఒక వేళ ఈ సర్టిఫికెట్లు చెల్లుబాటు అవుతాయా లేదా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఈ తతంగం జరుగుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దాదాపు 400 వరకు జనన మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ అయినట్లు తెలిసింది.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌కు వారం రోజులుగా డిజిటల్ కీ ఇవ్వకపోవడంతో ప్రతిపక్ష కౌన్సిలర్లు కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశారు. వెంటనే బల్దియా సిబ్బంది అలర్ట్ అయి డిజిటల్ కీ ఇచ్చినట్లు తెలిసింది.

అధికారులు చర్యలు తీసుకోవాలి



జనన, మరణ ధ్రువీకరణ పత్రాలపై పాత మున్సిపల్ కమిషనర్ పేరుపై డిజిటల్ సైన్‌తో సర్టిఫికెట్లు జారీ అవుతున్నాయి. అన్ని డిపార్ట్‌మెంట్లలోనూ ఇదే పరిస్థితి. ప్రజల్లో ఉన్న భయాన్ని తొలగించాలి. అధికారులపై సైతం చర్యలు తీసుకోవాలి.

– అనుమల్ల జయశ్రీ, 35వ వార్డు కౌన్సిలర్

సాంకేతిక లోపంతోనే సమస్య



సీఎండీఎంలో సాంకేతిక లోపంతోనే సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తుతాయి. దీంతో పాత డిజిటల్ సైన్‌తో సర్టిఫికెట్లు జారీ కావొచ్చు. మళ్లీ దరఖాస్తు చేసుకుంటే నూతన కమిషనర్ సైన్‌తో ఇవ్వవచ్చు. అయినా సర్టిఫికెట్లలో సవరణకు చర్యలు తీసుకుంటాం.

– అనిల్‌బాబు, మున్సిపల్ కమిషనర్

‘చల్మెడ’ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన నాయకులు

కథలాపూర్/మేడిపెల్లి(వేములవాడ): జగిత్యాల జిల్లా బీమారం, మేడిపెల్లి మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నేత చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. న్యాయవాది తన్నీరు శ్రీనివాస్‌రావు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు భూమరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వంగ వెంకటేశం, దేశాయిపేట, రాజలింగంపేట, కమ్మరిపేట, దమ్మన్నపేట, మాచపూర్, వల్లంపెల్లి, కొండాపూర్, కట్లకుంట, కాచారం, ఒడియాడ్, కల్వకోట, విలయతాబాద్ అభిలాష్, నారాయణ, సురేశ్, బుడుత జయశ్రీ,, ఆదె లక్ష్మీరాజం, మహేశ్ తదితరులు హాజరయ్యారు. వీరితోపాటు ఎంపీటీసీలు పల్లి అర్జున్, భూమేశ్, రవి, రాజేశ్వర్, లోలపు రెడ్డి, ఆదే రాజంతోపాటు విజయ, అంకం సాగర్, సురేందర్‌రావు తదితరులు ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. అయితే, చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు వేములవాడ టికెట్ వస్తుందనే ఆశతో వీరంతా ఆత్మీయ సమ్మేళనానికి హాజరైనట్లు తెలిసింది. రెండు మండలాలకు చెందిన సుమారు 200మందికిపైగా బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరవడం జిల్లావ్యాప్తంగా చర్చకు దారితీసింది. కాగా, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు విదేశీ పర్యటనలో ఉండగా ఆత్మీయ సమ్మేళనం జరగడం రాజకీయ పరంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు.. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు కథలాపూర్‌లోని ఓ హోట్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేములవాడ టికెట్ చల్మెడ లక్ష్మీనర్సింహారావుకే వస్తుందనే సంకేతాలు వస్తున్నాయని, అందుకే ఆయనకు మద్దతుగా ఈ సమావేశం నిర్వహించామని కొందరు నాయకులు తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

సారంగాపూర్: ఆర్థిక ఇబ్బందులతో మండలంలోని పోతారం గ్రామానికి చెందిన దోసండ్ల రాజం (46) ఉరేసుకొని మృతిచెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. రాజం కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. సాయంత్రం కుటుంబ సభ్యులు జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య వెంకటి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వెంకటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలుడిపై వీధి కుక్కల దాడి



గాయపడిన విశ్వక్

సైదాపూర్(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం అమ్మనగుర్తిలో ఆదివారం ఉదయం విశ్వక్(5)పై అనే బాలుడిపై వీధికుక్కలు దాడి చేశాయి. గ్రామానికి చెందిన సర్జన శ్రీకాంత్– మమత ల కొడుకు విశ్వక్ పక్కింటికి పాలు తెచ్చేందుకు వెళ్లాడు. సమీపంలో గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు బాలుడిపై దాడి చేశాయి. బాలుడి అరుపులు విని గ్రామస్తులు కుక్కలను తరిమేశారు. గాయపడిన బాలుడిని చికిత్సకోసం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి



అక్రమొద్దీన్ (ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో పడి మృతిచెందాడు. ముస్తాబాద్ ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాలు. మండలంలోని కొండాపూర్‌కు చెందిన మహ్మద్ అక్రమొద్దీన్ (55) ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అక్రమొద్దీన్ వేసిన వలలోనే చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. గట్టున ఉన్న వారు గమనించి కేకలు వేసేలోపే నీటిలో కనిపించకుండా పోయాడు. సమాచారం అందుకున్న ఎస్సై శేఖర్‌రెడ్డి చెరువు వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు గాలించినా ఆయన ఆచూకీ లభించలేదు. సాయంత్రం కరీంనగర్ నుంచి గజ ఈతగాళ్లను తెప్పించారు. వారు తీవ్రంగా గాలించడంతో రాత్రి పొద్దుపోయిన తర్వాత అక్రమొద్దీన్ మృతదేహం లభించింది. వ్యవసాయం పనులు చేసుకునే అక్రమొద్దీన్‌కు భార్య గౌస్య, కుమారుడు, కూతురు ఉన్నా రు. ఉపాధి కోసం కుమారుడు దుబాయి వెళ్లాడు.

పోలీసుల అదుపులో వ్యభిచార ముఠా.!

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతం బైపాస్ రోడ్డులోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న ఓ ముఠాను అదుపులోకి తీసుకొని, విచారణ చేపట్టినట్లు పట్టణ ఎస్సై అబ్దుల రహీం తెలిపారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా నిజామాబాద్, వరంగల్ నుంచి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం పట్టణ ఎస్సై రహీం ఆధ్వర్యంలో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు యువతులు, యువకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌షాక్‌తో గొర్రెలు మృతి

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి గ్రామంలో విద్యుత్‌షాక్‌తో నాలుగు గొర్రెలు మృతిచెందినట్లు ఆదివారం గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన బర్రె లచ్చన్న తన గొర్రెలను మేపేందుకు గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ వైరు తెగిపడి తగలడంతో నాలుగు గొర్రెలు మృతిచెందాయి. తనకు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు. పరిహారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని ట్రాన్స్‌కో ఏఈ జమీల్‌పాషా పేర్కొన్నారు.

లౌకికశక్తులు ఏకమై బీజేపీని ఓడించాలి

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

చిగురుమామిడి(మానకొండూర్): మతోన్మాద బీజేపీని రాష్ట్రంలో నిలువరించాలంటే ప్రజాతంత్ర లౌకికవాదులు కమ్యూనిస్టులతో కలిసి పనిచేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని బొమ్మనపల్లి, సుందరగిరి, గాగిరెడ్డిపల్లి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన చట్ల హన్మంతు, బెడిగం వీరవ్వ, కాశవేని ఎంకవ్వ, ధారవేని అనూష, కాల్వల రాజిరెడ్డిల కుటుంబాలను పరామర్శించారు. చిగురుమామిడిలోని ముస్కు రాజిరెడ్డి స్మారకభవనంలో మాట్లాడుతూ.. బీజేపీ నాయకత్వం తెలంగాణలో పాగావేసేందుకు అనేక కుట్రలు చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా ఐదురాష్ట్రాల్లో త్వరలో జరుగనున్న ఎన్నికల్లో మతాన్ని రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చేందుకు కుయుక్తులు పన్నుతోందని విమర్శించారు. గృహలక్ష్మి దరఖాస్తుకు రేషన్‌కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం అర్హులైన ప్రతీఒక్కరికి రేషన్‌కార్డులు జారీచేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అందెస్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, బూడిద సదాశివ, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, గోలి బాపురెడ్డి పాల్గొన్నారు.

రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలి

కరీంనగర్: క్రాఫ్‌లోన్ చెల్లించిన వారికి రుణమాఫీ నగదు వేయడంలో జరిగిన గందరగోళ పరిస్థితులపై స్పష్టత ఇవ్వాలని చాడ వెంకట్‌రెడ్డి సీఎం కేసీఆర్‌కు ఫ్యాక్స్ ద్వారా లేఖ పంపారు. రైతులకు రుణమాఫీలో భాగంగా క్రాఫ్‌లోన్ తీసుకొని పూర్తిగా రుణాన్ని చెల్లించిన రైతులకు రుణమాఫీ చేసినట్లు ట్రెజరీ ద్వారా బ్యాంక్‌లో నగదు పడినట్లు ఫోన్‌కు మెసేజ్ రూపంలో సమాచారం వస్తుందని కానీ క్రాఫ్‌లోన్ కట్టిన వెంటనే సంబంధిత ఖాతా రద్దు చేయబడుతుందన్నారు. ఆ ఖాతాలో ఎలాంటి నగదు జమ కాలేదని బ్యాంకు అధికారులు తెలుపుతున్నారని అన్నారు. ఇలాంటి గందరగోళ పరిస్థితులు ఎందుకు జరుగుతున్నాయో సంబంధిత అధికారులకు కూడా తెలియకపోవడం అన్యాయంగా ఉందన్నారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

- రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గర్జనలో జేఏసీ నేతల డిమాండ్



గర్జనలో ఐక్యత చూపుతున్న ఉద్యోగులు

కొత్తపల్లి(కరీంనగర్): రాష్ట్రంలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గర్జన నిర్వహించారు. పలువురు నేతలు మాట్లాడుతూ.. అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు కీలకంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. వీఆర్ఏ, వీఆర్వో, ఎలక్ట్రిసిటీ, ఆర్టీసీ, సెర్ప్ ఉద్యోగుల మాదిరిగానే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. మూడేళ్ల కాలపరిమితి పూర్తయిన ఔట్ సోర్సింగ్ సిబ్బందిని తక్షణమే రెగ్యులర్ చేయాలని, హెల్త్‌కార్డులు ఇవ్వాలని, మరణించిన వారి కుటుంబాలకు రూ.5లక్షల ఆర్థికసాయం, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జేఏసీ నేతలు లక్ష్మయ్య, రాజిరెడ్డి, శ్రీధర్, జగదీష్, సంతోశ్, వినోద్, సంధ్య, విజయలక్ష్మి, గోవర్ధన్, నారాయణలతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8 వేల మంది ఉద్యోగులు హాజరయ్యారు.

గద్దర్ పాట అజరామరం

- భారత్ బచావో ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య



మాట్లాడుతున్న గాదె ఇన్నయ్య

హుజురాబాద్: ప్రజా యుద్ధనౌక గద్దర్ పాట అజరామరమని భారత్ బచావో ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య అన్నారు. ప్రజాసంఘాల వేదిక ఆధ్వర్యంలో హుజూరాబాద్ అంబేద్కర్‌చౌరస్తాలో గద్దర్ సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాకవి, గాయకుడు గద్దర్ భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన పాటలు ఎంతోమందికి ప్రేరణగా నిలిచాయని పలువురు వక్తలు స్మరించుకున్నారు. గాదె ఇన్నయ్య మాట్లాడుతూ.. గద్దర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా పోతాడని అన్నారు. గద్దర్ అంతిమయాత్రలోనే పాత్రికేయుడు, సంపాదకుడు జహీర్‌అలీ మృతిచెందడం ప్రజా ఉద్యమానికి తీరని లోటని అన్నారు. మతం పేరుతో ఉన్మాదులు దాడులు చేస్తూ దళితులు, బహుజనులు, మైనార్టీల హక్కులను కాలరాస్తున్న తరుణంలో గద్దర్, జహీర్ అలీ బతికి ఉండాల్సిందని అన్నారు. అనంతరం అరుణోదయ విమలక్క ఫోన్లో మాట్లాడారు. ప్రజా ఉద్యమాలు బతికి ఉన్నంతవరకు గద్దర్ బతికే ఉంటాడన్నారు. ప్రజా సంఘాల నాయకులు ఆవునూరు సమ్మయ్య, పలకల ఈశ్వర్‌రెడ్డి, వేల్పుల రత్నం, ముక్కెర రాజు, పొడిచెట్టి వెంకట్రాజం, అంతం లింగారెడ్డి, సదానందం, వెంకన్న, వేల్పుల ప్రభాకర్, కుమారస్వామి, ఇమ్మడి సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువు కోసం వెళ్లి కానరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో మెట్‌పల్లి యువకుడి మృతి
- నాగ్‌పూర్‌లో ఘటన..



అబూబకర్ (ఫైల్)

మెట్‌పల్లి: ఆ యువకుడు చదువులో ప్రతిభావంతుడు. మహారాష్ట్రలోని పేరొందిన కళాశాలలో సీటు సాధించాడు. చదువు పూర్తయితే మంచి ఉద్యోగం వస్తుందని తల్లిదండ్రులు ఆశపడ్డారు. కానీ అంతలోనే రోడ్డు ప్రమాదం రూపంలో యువకుడు మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే... ఇస్లాంపురాకు చెందిన అహ్మద్‌కు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్ద కుమారుడు అబూబకర్ (21) ఇంటర్ వరకు పట్టణంలోనే చదివాడు. తర్వాత నాగ్‌పూర్‌లోని ప్రముఖ కళాశాలలో ఇంజినీరింగ్‌లో సీటు సాధించాడు. శనివారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా అబూబకర్ అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఎదిగిన కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో గుండెలవిసేలా రోదించారు.

అరకొరగా పశు వైద్యసిబ్బంది

- పశువులకు ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- పక్కదారి పడుతున్న మందులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు



అరకొరగా వైద్యసిబ్బంది

జిల్లాలో పశువుల వివరాలు	
ఆవులు :	36,782
గేదెలు :	1,02,439
గొర్రెలు :	6,10,985
మేకలు :	97,033

రాయికల్: వర్షాకాలంలో పశువుల్లో సీజనల్ వ్యాధులు ఎక్కువగా సోకుతాయి. ముఖ్యంగా గొర్రెలు, మేకల్లో నీలినాలుక, చిటుకరోగం, ఫుట్‌రాట్ వ్యాధి, గాలికుంటు, కుంట్లు పట్టడం వంటి వ్యాధులు ఎక్కువగా ప్రబలుతాయి. వ్యాధుల నియంత్రణకు ప్రభుత్వం నుంచి సరఫరా అయ్యే మందులు కూడా అరకొరగా రావడం, సరఫరా అయిన మందుల్లో సైతం కొందరు వైద్యులు యాదవ రైతులకు అమ్ముకోవడం లాంటి సందర్భాలున్నాయి. నీలి నాలుక నియంత్రణ కోసం వేసే బ్లూటంగ్ వ్యాక్సిన్ సైతం కొందరు పశువైద్యాధికారులు బయట విక్రయిస్తూ అందినంత దోచుకుంటున్నారు.

జిల్లాలో 45 సబ్‌సెంటర్లు ఉండగా 30 మండల పశువైద్యశాలలు, రెండు ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. ఇందులో పది వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ (వీఏఎస్)లు గొల్లపల్లి, మేడిపల్లి, సారంగాపూర్, వెల్గటూర్, గోదూరు, ఆత్మకూర్, తుంగూర్, మల్యాల, అల్లీపూర్, వెన్గుమట్లలో ఖాళీ పోస్టులున్నాయి. 18 లైవ్‌స్టాక్ అసిస్టెంట్లు, 5 వెటర్నరీ అసిస్టెంట్లు, 9 ఆఫీస్ సబార్డినేట్లు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

పక్కదారి పడుతున్న మందులు

ప్రతీ నాలుగు నెలలకోసారి యాదవులు, పాడి రైతులకు ప్రభుత్వం నుంచి అరకొర మందులు సరఫరా అయినా వాటిని సైతం పశువైద్య సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారు. యాదవులకు గొర్రెలు, మేకలకోసం నట్టల మందు, జ్వరం, నీలినాలుక, గాలికుంటు, యాంటిబయాటిక్, పాడి గేదెలకు ముద్దచర్మం వంటి టీకాలు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుంది. కానీ రైతులకు సరఫరా చేయకపోవడంతో వచ్చిన మందులు సంబంధిత అధికారులే పక్కదారి పట్టిస్తున్నారు.

పూర్తిస్థాయిలో సరఫరా చేయాలి



ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయిలో మందులు సరఫరా చేయాలి. అరకొర మందులను సరఫరా చేయడంతో గొర్రెలకు వివిధ వ్యాధులు సోకినప్పుడు ప్రైవేట్ వైద్యులు, మెడికల్ దుకాణాల్లో మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

– బజారి లింగన్న, రైతు, వీవీరావుపేట, మల్లాపూర్

మందులు పక్కదారి పట్టిస్తే చర్యలు



జిల్లాలో పశువైద్య అధికారులు ప్రభుత్వం మంజూరు చేసిన మందులను, వ్యాక్సిన్లను ఉచితంగా పంపిణీ చేయాలి. ఎవరైనా పక్కదారి పట్టిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం. సంబంధిత రైతులు నేరుగా తన దృష్టికి తీసుకురావాలి.

– గోపాలకృష్ణమూర్తి, జిల్లా పశు వైద్యాధికారి, జగిత్యాల